నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 19 జూలై 2024 | HYDERABAD




## ఎల్లమ్మకు నాలుగో బోనం

గోల్కొండ కోటలో కొలువైన జగదాంబిక మహంకాళి ఎల్లమ్మ ఆలయంలో గురువారం భక్తులు నాలుగో బోనం సమర్పించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు, తొట్టెలు సమర్పించారు. ఆలయ ఈవో శ్రీనివాసరాజు, బోనాల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కాంత అరవింద్, మహేశ్‌కుమార్ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

- మెహిదీపట్నం, జూలై 18



లారీ డ్రైవర్‌ను బూతులు తిడుతూ.. చేయిచేసుకుంటున్న జీడిమెట్ల ట్రాఫిక్ ఎస్‌ఐ యాదగిరి..




ఎక్స్‌వేదికగా డీజీపీకి కేటీఆర్ చేసిన ట్వీట్.

# చేయిచేసుకొని.. బూతులు తిట్టి..

### లారీ డ్రైవర్‌ను దుర్భాషలాడిన జీడిమెట్ల ట్రాఫిక్ ఎస్‌ఐ

సోషల్ మీడియాలో వీడియో వైరల్

ఎక్స్ వేదికగా స్పందించిన కేటీఆర్.. డీజీపీకి ట్వీట్

ఆమోదయోగ్యమైన భాషేనా అది..అంటూ అభ్యంతరం

ఎస్‌ఐని హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేసిన పోలీస్ బాస్

దుండిగల్: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఎస్‌ఐ అనుచితంగా ప్రవర్తించాడు. నో పార్కింగ్ జోన్‌లో లారీని నిలిపాడన్న కారణంతో డ్రైవర్‌పై చేయిచేసుకోవడమే కాకుండా.. బండబూతులు తిట్టాడు. ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు. 'ఫ్రెండ్లీ పోలీసింగ్ పోయి.. బూతుల పోలీసింగ్ వచ్చేనం'టూ డీజీపీకి ట్వీట్ చేశారు. దీనిపై స్పందించిన డీజీపీ.. సదరు ఎస్‌ఐని హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద గండిమైసమ్మ చౌరస్తా వైపు నుంచి మెదక్ జిల్లా నర్సాపూర్ వైపు వెళ్తున్న ఓ లారీని బుధవారం నో పార్కింగ్ జోన్‌లో నిలిపాడు డ్రైవర్. సిబ్బందితో కలిసి అక్కడే విధులు నిర్వర్తిస్తున్న జీడిమెట్ల ట్రాఫిక్ ఎస్‌ఐ యాదగిరి డ్రైవర్‌ను లారీ తీయాలని సూచించాడు. లారీ ఆగిపోయిందని.. కొద్దిసేపట్లో తీస్తానని చెప్పడంతో ఎస్‌ఐ అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. తిట్ల పురాణం అందుకొని.. చేయిచేసుకున్నాడు. ఇదంతా ఓ బాటసారి తన ఫోన్‌లో వీడియో తీసి.. సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరలయ్యింది. ఈ క్రమంలో డ్రైవర్స్ యూనియన్ నాయకులు డ్రైవర్లతో కలిసి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ముందు కొద్దిసేపు ఆందోళనకు దిగారు. డ్రైవర్‌పై దాడికి పాల్పడిన ఎస్‌ఐ యాదగిరి, పోలీస్‌సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ..సీఐకి వినతిపత్రం అందజేశారు. కాగా, సదరు ఘటనపై ఎక్స్ వేదికగా స్పందించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. రాష్ట్ర డీజీపీ జితేందర్‌కు ఆ వీడియోను ట్యాగ్ చేస్తూ..ట్వీట్ చేశారు. 'పౌరుల పట్ల పోలీసులు వ్యవహరించే విధానం ఇదేనా..'? పోలీసులకు, పోలీసు యంత్రాంగానికి ఆమోదయోగ్యమైన భాషేనా.. అది' అంటూ ప్రశ్నించడంతో పాటు నో పార్కింగ్ జోన్‌లో లారీని నిలిపితే డ్రైవర్‌ను అంతనీచంగా తిట్టాలా...? పోలీసులు, ప్రభుత్వ అధికారులకు ప్రజలే జీతాలు చెల్లిస్తున్నారు.. గుర్తుంచుకోవాలి..ఇదొక్కటే కాదు.. ప్రతి నిత్యం ఇలాంటివి సోషల్ మీడియాలో ఎన్నో చూస్తున్నామం'టూ కామెంట్ చేశారు. ఇక కేటీఆర్ ట్వీట్‌పై స్పందించిన డీజీపీ జీడిమెట్ల ట్రాఫిక్ ఎస్‌ఐ యాదగిరిపై చర్యలు తీసుకున్నారు. హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలంటూ ఆదేశించినట్లు జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.



## • గోపన్‌పల్లికి మోక్షం

## కేటీఆర్ ట్వీట్‌కు సర్కారులో చలనం

రేపు ఫ్లైఓవర్‌ను ప్రారంభించనున్న సీఎం రేవంత్

యుద్ధప్రాతిపదికన తుది దశ పనులు

పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి, జూలై 18: గోపన్‌పల్లి ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేసుకున్నా.. ప్రారంభించకపోవడంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ట్వీట్‌తో సర్కారులో చలనం వచ్చింది. తమ ప్రభుత్వం నిర్మించిన ఈ ఫ్లైఓవర్‌ను ఎందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించడం లేదని కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ సమీపంలోని ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ..ట్రాఫిక్ కష్టాలు తగ్గుతాయని, నల్లగండ్ల, తెల్లాపూర్, చందానగర్ వాసులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని.. కానీ ఈ విషయాన్ని పట్టించుకోకుండా రేవంత్ సర్కార్ నిర్లక్ష్యం చేస్తున్నదని ధ్వజమెత్తారు. కేటీఆర్ ట్వీట్‌తో అధికార యంత్రాంగం దిద్దుబాటు చర్యలు ప్రారంభించింది. వెంటనే ఫ్లై ఓవర్‌ను ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి. ఈ క్రమంలో గోపన్‌పల్లి తండాలో యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్న ఫ్లైఓవర్ తుది దశ పనులను గురువారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, శేరిలింగంపల్లి సర్కిల్ ఉపకమిషనర్ రజనీకాంత్‌రెడ్డి పరిశీలించారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఫ్లైఓవర్‌ను ప్రారంభించనున్న నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

### రూ. 28.5 కోట్ల వ్యయంతో..

బీఆర్‌ఎస్ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో గోపన్‌పల్లి తండా జంక్షన్‌లో వై ఆకారంలో రూ: 28.5 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా ఈ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని చేపట్టారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఐటీ కారిడార్ వైపు నుంచి నలగండ్ల, చందానగర్ వైపు 430 మీటర్ల పొడవు, తెల్లాపూర్ వైపు 550 మీటర్ల పొడవుతో వై ఆకారంలో వన్ వేగా దీనిని నిర్మించారు. ముఖ్యంగా ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే.. ఐటీ కారిడార్ నుంచి నల్లగండ్ల, తెల్లాపూర్, చందానగర్, బీహెచ్‌ఈఎల్ ప్రాంతాల వారికి ట్రాఫిక్ కష్టాలు తీరుతాయి.




# మరోసారి వివరాలు ఇవ్వండి..

### గృహజ్యోతి, మహాలక్ష్మి అందని అర్హులకు మంత్రి పొన్నం సూచన

సిటీబ్యూరో: ఆరు గ్యారెంటీల అమల్లో భాగంగా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు అందని అర్హులకు కలెక్టరేట్‌లోని ప్రజా పాలన సేవా కేంద్రంలో మరోసారి వివరాలు ఇవ్వాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సూచించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి కలెక్టరేట్‌లో గురువారం ప్రజా పాలన సేవా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవా కేంద్రం అందుబాటులో ఉంటుందని చెప్పారు. రూ. 500కే గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా స్కీంకు దరఖాస్తు చేసుకున్నా..అందని వారు మరోసారి వివరాలు ఇచ్చి లబ్ధి పొందాలన్నారు.

## నియోపోలిస్‌లో అందమైన రోడ్లు

సిటీబ్యూరో, జూలై 18 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ ప్రమాణాలతో హెచ్‌ఎండీఏ మూడేండ్ల కిందట చేపట్టిన నియోపోలిస్ నేడు సుందర నగరంగా ఎదుగుతున్నది. ప్రణాళికాబద్ధమైన నిర్మాణ శైలి, మెరుగైన మౌలిక వసతులతో నియోపోలిస్ లే అవుట్‌ను కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందించింది. ఇందుకు అనుగుణంగానే హెచ్‌ఎండీఏ మౌలిక వసతులను కల్పిస్తున్నది. తాజాగా, ఆరు లైన్ల మెటల్ రోడ్లు పనులు చివరి దశలో ఉన్నాయి. సెంట్రల్ ల్యాండ్ స్కేపింగ్, వంపులు తిరుగుతూ సువిశాలమైన ఆరు లైన్లతో ఎంతగానో ఆకట్టుకునేలా ఈ రహదారులను తీర్చిదిద్దుతున్నారు.





## పార్కులను థీమ్‌గా తీర్చిదిద్దాలి

### క్షేత్రస్థాయి పర్యటనలో కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, జూలై 18 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీ సర్కిల్ పరిధిలో చేపట్టిన వివిధ సివిల్ వర్క్స్ టెండర్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ ఆమ్రపాలి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం జూబ్లీహిల్స్ సర్కిల్‌లో పర్యటించిన కమిషనర్.. లోటస్‌పాండ్, పాత్‌వే, మంగోలియా బేకరీ వద్ద ఉన్న పార్కును పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. లోటస్ పాండ్‌లోని సీవరేజీ కనెక్షన్లను తొలగించాలని, నాలాల్లో స్టామ్ వాటర్, ఫ్లోటింగ్ మెటీరియల్ రాకుండా మెష్ ఏర్పాటు చేయాలని సూచించారు. దెబ్బతిన్న పాత్‌వేలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. మంగోలియా బేకరీ వద్ద నుంచి రోడ్ నంబర్ 44, 45 వరకు రోడ్డు, సీవరేజీ పనులు చేపట్టేందుకు సంబంధించిన సివిల్ వర్క్ టెండర్ల ప్రక్రియను త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. హైటెన్షన్ వైర్లు దిగువన ఉన్న అన్ని పార్కులను థీమ్ పార్కులుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని యూబీడీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ఈఈ విజయ కుమార్, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు. అలాగే జోనల్ కమిషనర్, అడిషనల్ కమిషనర్ యూసీడీ, హెల్త్, చీఫ్ ఎంటమాలజీ, కాల్ సెంటర్ ఓఎస్డీలతో కమిషనర్ ఆమ్రపాలి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రేటర్‌లో దోమల ఉత్పత్తి అయ్యే హాట్ స్పాట్‌లను గుర్తించి.. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డెంగీ వ్యాధి నివారణలో భాగంగా పాఠశాల, కాలేజీల్లో చేపట్టే అవగాహన కార్యక్రమాలను వెంటనే పూర్తి చేసి, హాట్ స్పాట్‌లపై దృష్టి సారించాలన్నారు. ఈఎంఐ పూర్తి చేసిన స్వచ్ఛ ఆటో యజమాని సక్రమంగా హాజరు కాకుండా నిర్దేశించిన ప్రకారంగా చెత్త సేకరణ చేయని పక్షంలో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యుద్ధ ప్రాతిపదికన జీవీపీల తొలగింపు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. షాపింగ్ మాల్, సినిమా థియేటర్లలో టాయిలెట్లు పరిశుభ్రంగా ఉండే విధంగా, ఫైర్ సేఫ్టీ కూడా పరిశీలన చేసి.. సర్కిల్ వారీగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

# 600 మిలియన్ యూనిట్లు!

ఆగస్టు 2020 నుంచి ఇప్పటివరకు

17.6 లక్షల టన్నుల వ్యర్థాలతో ఉత్పత్తైన విద్యుత్

'వెల్త్ ఆఫ్ వేస్ట్'ను సృష్టించడంలో దూసుకుపోతున్న బల్దియా

సిటీబ్యూరో: కేసీఆర్ ప్రభుత్వంలో తీసుకున్న విప్లవాత్మకమైన నిర్ణయాలు నేడు అద్భుత ఫలితాలు ఇస్తున్నది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, విధానాల అమలుతో వ్యర్థాల నుంచి సంపద (వెల్త్ ఆఫ్ వేస్ట్)ను సృష్టించడంలో బల్దియా దూసుకుపోతున్నది. జవహర్ నగర్ ఫేజ్-1లో 24 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నది. ఆగస్టు 2020 నుంచి ఇప్పటి వరకు 17.6 లక్షల టన్నుల చెత్త నుంచి 600 మిలియన్ యూనిట్ల కరెంటు ఉత్పత్తి అయ్యింది. ఆరు కేంద్రాల ద్వారా 101 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకోగా, జవహర్‌నగర్, దుండిగల్ 15 మెగావాట్లు ప్లాంట్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ ఏడాది చివరి నాటికి జవహర్‌నగర్ ఫేజ్-2 (24 మెగావాట్లు), ప్యారానగర్(12), యాచారం (12), బీబీనగర్ (11) కేంద్రాలు అందుబాటులోకి రానున్నది. రోజుకు జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు 7760 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తరలిస్తుండగా, 3768 మెట్రిక్ టన్నుల పొడి చెత్తను వేరే చేసి కరెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. 579 లీచెడ్ వ్యర్థాలు, 1165 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్, 336 మెట్రిక్ టన్నుల సేంద్రియ ఎరువు బయటకు వస్తున్నది.



### 1600 టన్నుల చెత్తను..

వ్యర్థాల నుంచి విద్యుదుత్పత్తి చేయడంలో బల్దియా మంచి ఫలితాలను రాబడుతున్నది. జవహర్‌నగర్ ప్లాంటు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి 1500-1600 టన్నుల చెత్తను రెండు బాయిలర్లలో వేస్తున్నారు. దాని నుంచి వచ్చే మంటలు నీటిని మరిగించి.. ఆవిరిని ఉత్పత్తి చేస్తుంది. ఆవిరి ద్వారా టర్బయిన్లు వేగంగా తిరిగి కరెంటు ఉత్పత్తి అవుతుంది. మొదటి ప్లాంటును పూర్తి స్థాయిలో నడిపి 50 శాతం ఉత్పత్తి చేయగా, 65 శాతానికి పెంచారు.

### ఆ రెండు ప్లాంట్ల ద్వారా..

చెత్తను జవహర్ నగర్ డంప్ యార్డుకు తరలించే ప్రక్రియను సమగ్ర మున్సిపల్ ఘన పదార్థాల నిర్వహణ ప్రాజెక్టుగా పరిగణిస్తారు. జవహర్‌నగర్ ప్లాంట్ -1, దుండిగల్ ప్లాంట్ ద్వారా ఇప్పటికే 39 మెగా వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను సెకండరీ కలెక్షన్, ట్రాన్స్‌ఫర్ పాయింట్స్ (ఎస్‌సీటీపీ) నుంచి వ్యర్థాలను జవహర్ నగర్ డంప్ యార్డు తరలిస్తారు. తరలించిన వెంటనే అక్కడ యాంత్రికంగా సెగ్రిగేట్ చేసిన తర్వాత మండే గుణం గల వ్యర్థాలను వేరు చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తారు.

## టీబీపై సీసీఎంబీ అధ్యయనం

సిటీబ్యూరో: టీబీపై సీసీఎంబీ పరిశోధనలు ముమ్మరం చేసింది. వ్యాధి నియంత్రణయే లక్ష్యంగా కొంత కాలంగా టీబీ బ్యాక్టీరియా జీవక్రియలను పరిశోధిస్తున్నారు. మైక్రో బ్యాక్టీరియం ట్యూబరోక్యూలోసిస్ వల్ల ఊపిరితిత్తులు ఏ విధంగా ప్రభావితమవుతున్నాయి..? మానవ రోగ నిరోధకతను ఏ విధంగా తట్టుకుంటున్నాయి..? వంటి విషయాలను తెలుసుకునేందుకు ఈ పరిశోధనలు చేస్తున్నట్లు సీసీఎంబీ వర్గాలు వెల్లడించాయి. అత్యంత క్లిష్టమైన, అతి సున్నితమైన ఊపిరితిత్తులోని అంతర భాగాలను నిర్వీర్యం చేయడంలో ఈ బ్యాక్టీరియా వేగంగా తమ రూపాన్ని మార్చుకుంటున్నదని, అదే సమయంలో రోగనిరోధకతను తట్టుకునేలా బలోపేతంగా మారుతున్నదని గుర్తించారు. అందుకే తమ పరిశోధనల్లో అత్యంత సంక్లిష్టమైన చికిత్స విధానాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతోనే ఈ పరిశోధనలు కొంత కాలంగా సాగుతున్నాయని, వచ్చే ఏడాదిలో జాతీయ స్థాయిలో పరిశోధన బృందం ఆధ్వర్యంలో జరిగే ఈఎంబీవో సమావేశంలో టీబీ నియంత్రణ, అధ్యయన తీరు తెన్నులపై చర్చించనున్నట్లు సీసీఎంబీ వర్గాలు పేర్కొన్నాయి.



అల్పపీడనం ప్రభావంతో రాగల 2 రోజులు గ్రేటర్‌లో అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం రాత్రి నగరంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసినట్టు వెల్లడించింది. -సిటీబ్యూరో